నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | ఆదివారం 1 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కేలి(బీ) అటవీ ప్రాంతంలో పులి

సాంగ్వీ, కేలి(బీ) ప్రాంతంలో కనిపించిన పులి అడుగు

కెరమెరి, ఆగస్టు 31 : కెరమెరి అడవుల్లోకి మళ్లీ పులి వచ్చింది. ఈ నెల 24న ఉమ్రి గ్రామ సమీపంలోని ఓ చేనులో పులి పాదముద్రాలు గుర్తించగా, శనివారం సాంగ్వీ, కేలి(బీ) పరిసరా ప్రాంతాల్లో దాని అడుగులు కనిపించాయి. దీంతో అటవీప్రాంత ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విషయమై ఎఫ్ఆర్వో సయ్యద్ మజారొద్దీన్ వివరణ కోరగా.. పాదముద్రాల ఆధారంగా ఆడ పులిగా గుర్తించినట్లు తెలిపారు. ఓ చేను సమీపంలో బురదలో నుంచి పులి వెళ్లిందని, దాని అడుగులు స్పష్టంగా కనిపించాయని అధికారులు.

కోవ లక్ష్మికి హరీశ్ పరామర్శ

ఆసిఫాబాద్ టౌన్,ఆగస్టు 31 : తీవ్రమైన జ్వరంతో హైదరాబాద్‌లోని మలక్ పేట్ యశోద హాస్పిటల్‌లో చేరిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోలుకుంటున్నారు. శనివారం మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ ఎస్ నాయకులతో కలిసి ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ లీడర్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో కనిపించని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సురేఖ ఫొటో

పీఎస్ఆర్ వర్సెస్ వివేక్

చెన్నూర్ పర్యటనకు డిప్యూటీ సీఎం రాకుండా పీఎస్ఆర్ అడ్డుకున్నారా?

- జిల్లా అధ్యక్షురాలి ఫొటో లేకుండానే ఫ్లెక్సీలు ఏర్పాటు
- చెన్నూర్‌లో ప్రేమ్‌సాగర్‌రావు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటుపై వివేక్ ఆగ్రహం
- రామగుండం నుంచి అలిగి చెన్నూర్‌కు వచ్చిన ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీ
- మంచిర్యాల జిల్లా కాంగ్రెస్‌లో తారాస్థాయికి చేరిన వర్గపోరు

చెన్నూర్‌కు డిప్యూటీ సీఎం రావడం లేదని తెలిసి తిరిగి వెళ్లిపోతున్న జనం

మంచిర్యాల, ఆగస్టు 31(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రి పదవి కోసం మొదలైన విభేదాలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన సాక్షిగా బయటపడ్డాయి. పెద్దపల్లి జిల్లాతోపాటు మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలో శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లు పర్యటించాల్సి ఉంది. కాగా.. రామగుండంలో మంత్రుల పర్యటన ఆలస్యమైంది. దీంతో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆయన కుమారుడు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. మంత్రుల పర్యటన సందర్భంగా చెన్నూర్ నియోజకవర్గంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై మంత్రుల సమక్షంలోనే వివేక్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు రామగుండం సింగరేణి గెస్ట్‌హౌస్ నుంచి ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీ అలిగి చెన్నూర్‌కు బయల్దేరి వచ్చారు. దీంతో డిప్యూటీ సీఎం చెన్నూర్ పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకున్నారు. రామగుండంలో ఆలస్యం కావడం, భారీ వర్షాలతో ఖమ్మం వెళ్లాల్సి రావడంతో భట్టి పర్యటన రద్దు చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నా.. ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీ అలిగి వచ్చాక కూడా డిప్యూటీ సీఎం, మంత్రులు రామగుండం పర్యటనను కొనసాగించడం అనుమానాలకు తావిస్తున్నది.

గెలిచిన నాటి నుంచే గొడవలు.. వివేక్ సఫరేట్ మీటింగ్..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచే ఎమ్మెల్యేల మధ్య దూరం పెరుగుతూ వస్తున్నది. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి, అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తే క్రెడిట్ మొత్తం చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు కొట్టేయడంపై ఎమ్మెల్యే పీఎస్ఆర్ ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. అక్కడ మొదలైన పంచాయతీ పెరుగుతూ వస్తున్నది. మంత్రి పదవి విషయంలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఎవరికి వారు సెఫరేట్‌గా ప్రయత్నాలు చేయడంతో ఒకరంటే ఒకరికి పడని పరిస్థితి నెలకున్నది. ఈ నేపథ్యంలో వచ్చిన ఎంపీ ఎన్నికల్లో తానేంటో అధిష్ఠానానికి చూపించుకోవాలనే ఉద్దేశంతో పీఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోసం కష్టపడ్డారు తప్పితే, వ్యక్తిగతంగా ఆయనకు ఇష్టం లేదనే చర్చ అప్పట్లో నడిచింది. ఇటీవల మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్న సమయంలోనూ ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లు వినిపించాయి. ఎవరికి వారు పదవి కోసం పట్టుపడుతున్న నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఒక రకంగా డిప్యూటీ సీఎం భట్టి చెన్నూర్ పర్యటన రద్దు చేసుకోడానికి కూడా పీఎస్ఆర్ కారణమనే చర్చ నడుస్తున్నది. రామగుండం నుంచి అలిగి వచ్చిన ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీకృష్ణ చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని చెన్నూర్ పర్యటనకు తీసుకొస్తానని, రాజకీయంగా ఇక నుంచి మరింత గట్టిగా ముందుకెళ్దామని వివేక్ సహచరులతో చెప్పుకొచ్చారు.

ఫ్లెక్సీల పంచాయతీ..

డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల పర్యటన సందర్భంగా ప్రేమ్‌సాగర్‌రావు చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై వివేక్ తీవ్రంగా మంత్రుల ముందే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అక్కడ మొదలైన పంచాయతీ డిప్యూటీ సీఎం పర్యటన రద్దు అయ్యే దాకా వచ్చింది. కాగా.. చెన్నూర్ కాంగ్రెస్ లీడర్లు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎమ్మెల్యే పీఎస్ఆర్ సతీమణి కొక్కిరాల సురేఖ ఫొటోలు పెట్టలేదు. ఇది కావాలనే ఉద్దేశపూర్వంగా చేసిందేంటూ పీఎస్ఆర్ వర్గీయులు ఆరోపిస్తున్నారు. రామగుండం నుంచి వివేక్ అలిగి వెళ్లివచ్చాక కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ప్రేమ్‌సాగర్‌రావు నాయకత్వంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తి నమ్మకం ఉందన్నారు. పీఎస్ఆర్ అభిమానుల మనోభావాలను అధిష్ఠానం గుర్తించిందని పరోక్షంగా పీఎస్ ఆరే పదవి వస్తుందనే సంకేతాలు ఇచ్చారు. దీంతో పీఎస్ఆర్ వర్గం నాయకులు సంబురపడుతున్నారు. ఈ పరిణామాలపై ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుటుంబం ఎలా స్పందిస్తుంది. జిల్లా కాంగ్రెస్ పార్టీలో పీఎస్ఆర్‌కు పోటీగా మరో వర్గాన్ని తయారు చేస్తారా? అనే చర్చ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.

పర్యటన రద్దుతో జనం అవస్థలు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెన్నూర్‌లో సోలార్ పవర్‌ప్లాంట్ ప్రారంభోత్సవానికి వస్తున్నారని తెలిసి కాంగ్రెస్ కార్యకర్తలు, జనాలు వచ్చారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రోగ్రాం అని తెలిసి వచ్చిన జనాలు సాయంత్రం 5 గంటల వరకు ఎదురుచూశారు. చివరకు డిప్యూటీ సీఎం రావడం లేదని తెలిసి ఆగ్రహంతో వెను తిరిగారు. వచ్చిన కొద్ది పాటి జనాలకు కనీసం భోజనాలు పెట్టకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. రోడ్డు నుంచి ప్రారంభోత్సవ వేదికకు అరకిలోమీటర్ దూరం నడుచుకుంటే వస్తే చివరకు రారని చెప్తారా.. ఇదేం పద్ధతి అంటూ తిట్టుకుంటూ వెళ్లిపోవడం కనిపించింది. చెన్నూర్‌లో పర్యటన రద్దయినా జైపూర్ ఎస్టీపీపీలోనైనా ఉంటుంది అనుకుంటే చాలా సేపు ఎదురుచూశాక అక్కడ కూడా ప్రోగ్రాం ఉండదంటూ చెప్పారు. దీంతో చాలా సేపు ఎదురుచూసిన జిల్లా అధికారులు, మీడియా, కాంగ్రెస్ నాయకులు వెళ్లిపోయారు.

అనధికారికంగా.. అద్దె చెల్లించకుండా!

శ్రీరాంపూర్ ఏరియాలోని క్వార్టర్లలో ప్రైవేట్ వ్యక్తుల నివాసం

- కొందరు అధికారులే ఆక్రమించుకొని ఇతరులకు అప్పగింత
- ఒక్కొక్కరూ రెండు.. మూడు క్వార్టర్లు తీసుకొని అద్దెకిస్తున్న వైనం
- సింగరేణి సంస్థకు నష్టం
- అర్హులై.. కిరాయి ఇళ్లలో ఉంటున్న అనేక మంది కార్మికులు
- పట్టించుకోని జీఎం.. ఇతర అధికారులు

శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి క్వార్టర్లు

మంచిర్యాల, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సింగరేణి యాజమాన్యం సిబ్బంది కోసం క్వార్టర్లు నిర్మించగా, కొందరు అధికారులే వాటిని ఆక్రమించి ఇతరులకు అద్దెకిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. శ్రీరాంపూర్ ఏరియాలో మొత్తం 7,141 క్వార్టర్లు ఉండగా, ఇందులో సంస్థ అధికారుల కోసం 219 క్వార్టర్లు కేటాయించారు. అలాగే సింగరేణి ప్రాంతంలో విధులు నిర్వర్తించే పోలీసు, రెవెన్యూ, కలెక్టరేట్ సహా ఇతర శాఖల్లో పని చేసే వారికి 345 క్వార్టర్లు ఇచ్చినట్లు తెలుస్తున్నది. కార్మికుల కోసం 5,850 క్వార్టర్లు కేటాయించగా, ఇందులో 668 ఖాళీగా ఉన్నాయి. ఇక మరో 59 క్వార్టర్లలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు సంస్థకు అద్దె చెల్లించకుండా ఏండ్లతరబడి అనధికారికంగా నివాసముంటున్నారు.

బయటి వ్యక్తులకు ఎలా?

సింగరేణిలో పని చేస్తూ సొంతంగా ఇళ్లు లేక బయట అద్దెకు ఉంటున్న కార్మికులు వందల్లో ఉన్నారు. న్యాయంగా వారికి కేటాయించాల్సిన క్వార్టర్లను కొందరు సింగరేణి అధికారులే ఆక్రమించుకున్నట్లు తెలుస్తున్నది. ఓ అధికారి తన పేరుపై తీసుకున్న క్వార్టర్ కాకుండా.. అదనంగా మరొకటి ఆక్రమించి ఇతరులకు అద్దెకు ఇస్తున్నారని తెలిసింది. ఇలా శ్రీరాంపూర్ ఏరియాలో అనేక మంది అధికారుల రెండోసి, మూడోసి చొప్పున క్వార్టర్లను ఆక్రమించుకున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. సింగరేణి ప్రాంతంలో పని చేసే ఇతర శాఖల ప్రభుత్వ ఉద్యోగుల కోసం 345 క్వార్టర్లు ఇవ్వగా, ఇందులో ఉద్యోగులే కాకుండా వేరే వారు సైతం ఉంటున్నారని చెబుతున్నారు. పోలీసు, రెవెన్యూ, కలెక్టరేట్ సిబ్బంది ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయాక కూడా వారి పేర్ల మీదే క్వార్టర్లు ఉంటున్నాయని, అలాంటి వాటిలో చాలా మంది అనధికారికంగా ఉంటున్నారని కార్మికులు అంటున్నారు. ఇవేకాకుండా 59 క్వార్టర్లలో ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకున్నారని.. వారు ఏ ప్రాతిపాదికన క్వార్టర్లలో ఉంటున్నారో తెలియడం లేదంటున్నారు. ఇదంతా ఏరియా జీఎంతో పాటు కింది స్థాయి అధికారుల వరకు తెలిసినా చర్యలు తీసుకోకుండా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారంటూ కార్మికులు మండిపడుతున్నారు.

కార్మికులకు వేధింపులు.. బయటి వ్యక్తులకు సపర్యలు..

సంస్థ కార్మికులకు కేటాయించిన క్వార్టర్ పక్కన ఏదైనా చిన్న షాప్ పెట్టినా.. ఇతర అవసరాల కోసం షెడ్డు వేసుకున్నా అధికారులు వాటిని వెంటనే కూల్చేస్తారు. అంతే కాకుండా సంస్థ స్థలంలో నిర్మాణాలు చేసినందుకు విద్యుత్, నల్లా కనెక్షన్లు బంద్ చేస్తారు. క్వార్టర్లలో ఉండే వారికి ఉచిత విద్యుత్, ఉచిత తాగునీటి సరఫరాతో పాటు పారిశుధ్య నిర్వహణ సైతం సింగరేణి సంస్థనే చూసుకుంటుంది. అయితే, అనధికారికంగా ఉండే వ్యక్తులకు సైతం ఉచితంగా తాగునీరు, విద్యుత్ సరఫరా చేయడం ఏమిటనేది అర్థం కావడం లేదు. ఆర్‌కే-5 కాలనీ బ్యారెక్స్ ఏరియాలోని సింగరేణి క్వార్టర్లలో చాలా మంది బయటి వ్యక్తులు ఉంటున్నారు. ఈ క్వార్టర్లకు కంపెనీ కరంట్, వాటర్ సరఫరా అవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఏరియా జీఎం దృష్టి సారించకపోవడం గమనార్హం. అర్హులైన కార్మికులు క్వార్టర్లు దొరక్క.. బయట అద్దెకు ఉంటుంటే, సింగరేణితో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు క్వార్టర్లను ఆక్రమించుకోవడం చర్చనీయాంశంగా మారింది. మరి ఇప్పటికైనా సింగరేణి ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి పరుల చేతుల్లో చిక్కిన సింగరేణి క్వార్టర్లను తిరిగి తీసుకొని, కార్మికులకు అప్పగిస్తారా లేదా అనేది తేలాల్సి ఉంది.

బయటి వ్యక్తులను ఖాళీ చేయించాలి

సింగరేణి క్వార్టర్లలో ఉండే బయటి వ్యక్తులను ఖాళీ చేయించాలి. అనధికారికంగా ఉంటున్న వారిని గుర్తించి వెంటనే ఆ క్వార్టర్లను సింగరేణి తీసుకోవాలి. సింగరేణేతర ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించిన క్వార్టర్లకు చాలా మంది అద్దె చెల్లించడం లేదు. వాళ్లకు ప్రభుత్వం నుంచి హెచ్ఆర్ఏ తీసుకుంటున్నప్పటికీ సింగరేణికి మాత్రం అద్దె చెల్లించడం లేదు. ఆయా డిపార్ట్‌మెంట్‌ల హెచ్‌వోడీలకు ఈ విషయంపై లెటర్లు రాసి క్వార్టర్లు తిరిగి తీసుకోవాలి. సొంతంగా ఇండ్లు కట్టుకొని కంపెనీ క్వార్టర్లను ఖాళీ చేయడానికి సిద్ధంగా ఉన్న వాళ్లు కూడా ఉన్నారు. వారి వద్ద నుంచి క్వార్టర్లు తీసుకొని కొత్త వారికి కేటాయించాలి.

- సురేందర్‌రెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ

పాలాల పండుగకు వేళాయే

- రేపు పాలాల అమవాస్య
- బసవన్న-రైతు అనుబంధానికి ప్రతీక
- అలంకరణ వస్తువుల కొనుగోళ్లలో అన్నదాతలు బిజీ

సిర్పూర్(టీ) వారసంతలో దుకాణాల వద్ద రైతుల సందడి

చెన్నూర్ టౌన్/సిర్పూర్(టీ), ఆగస్టు 31 : అన్నదాతకు అండగా నిలిచి, కుటుంబ సభ్యుల్లో ఒకరిగా మెదిలే ఎడ్లను అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే పండుగే పొలాల అమవాస్య. రైతు పెద్ద పండుగల్లో ఇదొకటి. ఏటా శ్రావణ అమవాస్య రోజున నిర్వహించే పొలాల అమవాస్య నాడు వాటిని పూజిస్తే శివుని అనుగ్రహంతో పాటు పంటలు బాగా పండుతాయని భక్తుల నమ్మకం. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ ఉత్సవాన్ని సెప్టెంబర్ 2న ఘనంగా నిర్వహించేందుకు రైతులంతా సిద్ధమయ్యారు. ఇప్పటికే ఎడ్ల అలంకరణకు జూలు, కాళ్లకు గజ్జెలు, ముగుతాళ్లలాంటివి కొనుగోలు చేస్తున్నారు.

శ్రావణమాసంలో పూజిస్తే..

శ్రావణమాసం శివుడికి అత్యంత ఇష్టం. ఈ నెలలో పశువు(నంది)లను పూజిస్తే శంకరుడు సంతోషిస్తాడని భక్తుల నమ్మకం. అందుకే పొలాల పండుగ రోజు పశువులతో ఎలాంటి పనులు చేయించరు. ఉదయమే వాటికి వాగులు, చెరువుల్లో శుభ్రంగా స్నానాలు చేయిస్తారు. రంగ రంగులతో అందంగా అలంకరిస్తారు. కొత్త ముగుతాళ్లు వేస్తారు. సాయంత్రం హనుమాన్, శివాలయం మందిరాల వద్దకు తీసుకువెళ్లి వాటికి పూజలు చేస్తారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. అప్పటికే సిద్ధంగా ఉంచిన నైవేద్యాన్ని వాటికి తినిపిస్తారు. అనంతరం పెద్దలకు పూజలు చేస్తారు. ఆ తర్వాతే ఇంటిల్లిపాదీ కలిసి విందు ఆరగిస్తారు.

మార్కెట్లలో సందడి..

సోమవారం పొలాల అమవాస్యకావడంతో దుకాణాలు కొనుగోలు దారులతో సందడిగా మారాయి. పశువుల అలంకరణకు కావాల్సిన వస్తువులు కొనేందుకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పట్టణాల నుంచి విద్యార్థులు, ప్రజలు తమ సొంత గ్రామాలకు తరలివెళ్తున్నారు.

విధుల్లో అలసత్వం తగదు

- ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా
- తిర్యాణిలో పలు ఆశ్రమ పాఠశాలల తనిఖీ
- ఎస్ఈఆర్‌పీ సస్పెన్షన్‌కు ఆదేశం
- హెచ్ఎంలపై ఆగ్రహం

తిర్యాణి,ఆగస్టు 31 : ఉపాధ్యాయులు విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఊట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా అన్నారు. శనివారం పంగిడిమాదర గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలతో పాటు భీంజీగూడ,చింతలమాదర, పెందుర్‌గూడ, పర్చక్కిగూడ సంక్షేమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయాచోట్ల రికార్డులు, తరగతి గదులు, వంటశాలలు, పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పూర్తి సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందించాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వాడిగూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆలస్యంగా రావడం, రాజగూడ ప్రాథమిక పాఠశాల మూసి ఉంచడంపై ఎస్ఈఆర్‌పీ కైలాస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. భీంజీగూడ గిరిజన సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయుడు సమయపాలన పాటించకపోవడం, మధ్యాహ్న భోజనం అందించకపోవడం, హాజరుపట్టిక నిర్వహణ సరిగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంగిడిమాదర స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడి అర్క లక్ష్మణ్‌పైనా మండిపడ్డారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు పలు ప్రశ్నలు సమాధానాలు రాబట్టారు. పంగిడిమాదర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఆమె వెంట ఏసీ ఎంవో పుర్క ఉద్ధవ్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

పంగిడిమాదర పాఠశాలలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా

విద్యార్థులతో కలసి కలెక్టర్ భోజనం

సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

సిర్పూర్(టీ), ఆగస్టు 31 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల-కళాశాలను శనివారం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూం, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆపై వారితో కలసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, నాణ్యమైన విద్యనందించాలని సిబ్బందికి సూచించారు. బిల్డింగ్‌లతో పాటు డైనింగ్ హాల్ శిథిలావస్థకు చేరిందని, భవనాలకు ఎర్తింగ్ వస్తున్నట్లు ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుమన్ పాల్గొన్నారు.

ఏం చేస్తరో చూడాలి

ఎన్నికలప్పుడు కాంగ్రెసోళ్లు రూ. 2 లక్షల దాకా రుణమాఫీ చేస్తమని చెప్పిన్రు. గద్దెనెక్కినంక అన్యాయం చేసిన్రు. నాకు రూ.1.97 లక్షల పంటరుణం ఉంది. ఇప్పటి దాకా కాలేదు. ఎందుకని బ్యాంకుకు వెళ్లి అడిగితే తెల్వదంటున్నరు. ఇకక వ్యవసాయ అధికారులను అడిగితే కొద్ది రోజులు ఆగితే తెలుస్తుందంటున్నరు. మా ఊరిలో రూ. 2 లక్షల దాకా రుణాలు తీసుకున్నోళ్లు దాదాపు 15 మంది ఉన్నరు. వీరిలో ఇద్దరు ముగ్గురికి కూడా రుణం మాఫీ అయినట్లు లేదు. ఎవ్వరిని అడిగినా కాలేదనే చెబుతున్నరు. ఇకనైనా న్యాయం చేస్తరో.. సున్నం పెడుతరో చూడాలి. *- బూరం సత్తయ్య, భూపాలపట్నం, సిర్పూర్-టీ*

నోట్లె మట్టి కొట్టిన్రు

నాకు వాంకిడిలోని స్టేట్ బ్యాంకులో రూ. 90 వేల పంట రుణం ఉంది. మొదటి విడుతలనే చేస్తమన్నరు. ప్రకటించి నెల దాటింది. ఇంత వరకు రుణం మాఫీకాలేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే కేవైసీ చేయించలేదు.. అందుకే జాబితాలో నాపేరు రాలేదంటున్నరు. మరి కేవైసీ చేయించకపోతే నాకు పంటరుణం యేటా ఎట్లా ఇచ్చారో అర్థమైతలేదు. కాంగ్రెస్‌ను నమ్మి గెలిపిస్తే రైతుల నోట్లె మట్టికొట్టిన్రు.

- ఆత్రం మెంగు, ఖానాపూర్, వాంకిడి

అన్ని అర్హతలున్నా అందకపాయే..!

ఆసిఫాబాద్ జిల్లాలో రుణమాఫీ కానోళ్లు 12 వేల మంది

- కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- రైతు వేదికలకు తరలివచ్చి ఫిర్యాదులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం మూడు విడుతల్లో రుణమాఫీ చేపట్టగా, జిల్లాలో 12 వేల మందికి అందలేదు. మొత్తం 1.26 లక్షల మంది రైతులుండగా, వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నవారు 42 వేల మంది ఉన్నారు. ఇందులో 30 వేల మందికి మాత్రమే రుణమాఫీ కాగా, మిగతా 12 వేల మందికి కాలేదు. ఆధార్‌కార్డులు లింక్‌లేకపోవడం, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్కుల్లో పేర్లలో తప్పులు దొర్లడం.. తదితర కారణాల వల్ల రుణమాఫీకాలేదని వ్యవసాయ అధికారులు చెబుతుండగా, అన్ని అర్హతులున్నా అన్యాయం చేశారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

రాష్ట్ర సర్కారు మొదటి విడుతలో రూ. లక్ష లోపు, ఆపై రూ. 1.50 లక్షలలోపు.. ఆగస్టు 15న రూ. 2 లక్షల లోపు రుణాలున్న రైతులకు మాఫీ చేసింది. కానీ అన్ని అర్హతలున్నా రుణమాఫీ కాని రైతులు వేలల్లో ఉన్నారు. తమకు న్యాయం చేయాలంటూ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారుల నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రైతువేదికల్లో ఫిర్యాదులు చేసేందుకు వందల సంఖ్యలో తరలి వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు వేలకు పైగా రైతుల నుంచి ఇప్పటి వరకు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ఇక రూ. 50 వేల లోపు రుణం ఉండి కూడా మాఫీ కాలేదంటూ వందల మంది రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర సర్కారు విఫలమైందని, అధికారుల తప్పిదం తమకు శాపంగా మారిందని, ఇకనైనా తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679